ప్రజాశక్తి
శుక్రవారం 7 ఫిబ్రవరి, 2025
5
శ్రీకాకుళం

వైసిపి యువజన విభాగం జోనల్ అధ్యక్షునిగా స్వరూప్

శ్రీకాకుళం అర్బన్ : వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షునిగా కొనసాగుతున్న మెండ స్వరూప్‌కు ఉత్తరాంధ్ర నాయకత్వ బాధ్యతలను పార్టీ అధ్యక్షులు వై.ఎస్.జగన్మోహనరెడ్డి అప్పగించారు. ఉత్తరాంధ్ర యువజన విభాగానికి అధ్యక్షునిగా బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం తాడేపల్లి నుంచి నియామకపు ఉత్తర్వులు గురువారం వెలువడ్డాయి. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాలకు ఆయన జోన్ అధ్యక్షునిగా కొనసాగుతారు. ఈ సందర్భంగా స్వరూప్ మాట్లాడుతూ పార్టీ అధిష్టానం అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తించగలనని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీకి పూర్వవైభవాన్ని తీసుకురావడానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

అట్టహాసంగా...

- పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి నామినేషన్
- విశాఖలో భారీ ర్యాలీ, బహిరంగ సభ
- ఉత్తరాంధ్ర నలుమూలల నుంచి కదిలొచ్చిన ఉపాధ్యాయులు
- గెలుపుతో ఉత్తరాంధ్రలో చరిత్ర లిఖించాలని వక్తల పిలుపు

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ బాలసుబ్రమణ్యం

నామినేషన్‌కు ప్రదర్శనగా వెళ్తున్న విజయగౌరి తదితరులు

ప్రజాశక్తి – గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి యుటిఎఫ్ బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కోరెడ్ల విజయగౌరి నామినేషన్ దాఖలు కార్యక్రమం విశాఖలో గురువారం అట్టహాసంగా సాగింది. ముందుగా ఉత్తరాంధ్ర నలుమూలల నుంచి తరలివచ్చిన యుటిఎఫ్ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, ప్రజా సంఘాల నాయకులతో కలిసి ఆమె విశాఖ నగరంలోని సరస్వతి పార్క్ నుంచి భారీ ర్యాలీగా బయలుదేరారు. లీలామహల్ జంక్షన్, జగదాంబ జంక్షన్ మీదుగా ఈ ర్యాలీ సాగింది. జగదాంబ థియేటర్‌కు ఎదురుగా ఉన్న తెన్నేటి విశ్వనాథం విగ్రహానికి విజయగౌరి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అక్కడ నుంచి మరలా మహారాణిపేట, కెజిహెచ్ మీదుగా కలెక్టరేట్ వరకూ ర్యాలీ కొనసాగింది. అక్కడ ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ పాలకులు విద్యారంగాన్ని నాశనం చేసే సంస్కరణలను అవలంబిస్తున్నారని తెలిపారు. విద్యారంగ పరిరక్షణకు విజయగౌరి గెలుపు అవసరమన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ రానున్న 20 రోజులూ ఎంతో కీలకమన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా విజయగౌరిని గెలిపించుకునే లక్ష్యంతో అందరూ కలిసి పనిచేయాలన్నారు. విజయగౌరి నామినేషన్ ర్యాలీలో అధికంగా మహిళలు పాల్గొన్నారని, పిడిఎఫ్ అభ్యర్థి గెలుపు కోసం ఇంటింటికీ వెళ్తుంటే మహిళలంతా పిడిఎఫ్‌కే తమ సంపూర్ణ మద్దతు ఇస్తామని చెబుతున్నారని, ఇదంతా చాలా ఉత్సాహం కలిగిస్తోందని అన్నారు. గతంలో అప్రెంటీస్ రద్దుపై యుటిఎఫ్ పోరాడినప్పుడు నాటి ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు జాడ లేకుండా పోయాడన్నారు. జగన్ తెచ్చిన 117 జిఒకు వ్యతిరేకంగా విజయవాడలో వేల సంఖ్యలో టీచర్లంతా పోరాడినప్పుడు ఎంఎల్‌సిగా ఉన్న పాకలపాటి రఘువర్మ పత్తాలేకుండా పోయాడని తెలిపారు. అందుకే టీచర్లంతా పిడిఎఫ్ అభ్యర్థులపై నమ్మకంతో ఉన్నారని ఉద్ఘాటించారు. విద్యారంగ పరిరక్షణ కోసం ఉత్తరాంధ్రలో పోరాడిన చరిత్ర కోరెడ్ల విజయగౌరిదని, ఆమె కుటుంబానికి ఉద్యమ నేపథ్యం ఉందని గుర్తుచేశారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విజయగౌరి పోరాట ప్రస్థానాన్ని తెలిపారు. ఆమె విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ బొబ్బిలి బిడ్డ, సమస్యలపై ప్రశ్నించే గొంతు అయిన విజయగౌరికి విజయం చేకూరేలా అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉద్యమాలు చేపట్టకపోతే ప్రభుత్వ విధానాల్లో మార్పు రాదని, ఉపాధ్యాయులకు కష్టాలొచ్చినప్పుడు కనపడని వారు నేడు పోటీకి సై అంటున్నారని తెలిపారు. అటువంటివారిని విద్యావంతులైన టీచర్లు ఓడించాలన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ మాట్లాడుతూ విద్యారంగాన్ని ధ్వంసం చేసే జాతీయ విద్యావిధానాన్ని ఆంధ్రప్రదేశ్ మాత్రమే అమలు చేస్తోందని, పిడిఎఫ్ అభ్యర్థిని గెలిపిస్తేనే దీన్ని అడ్డుకోవడం సాధ్యపడుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌సి, ఎస్‌టి యుఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందోలు వెంకటేశ్వర్లు, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు ఎస్ఎస్.నాగమణి, టిఆర్.అంబేద్కర్, చినబ్బాయ్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, పద్మ. కుమార్, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమం అజెండాగా పనిచేస్తా : విజయగౌరి

పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానన్నారు. విద్యా రంగంలో జిఒ 117ను సంపూర్ణంగా రద్దు చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తానన్నారు. పాఠశాలల మూత ఆపాలని, సిపిఎస్ రద్దు చేయాలని గొంతెత్తుతానన్నారు. యాప్‌ల భారం ఉపాధ్యాయులకు ఉండకుండా చేస్తానన్నారు. విద్యారంగాన్ని రక్షించే పోరాటాలు సాగిస్తానన్నారు. ఈ ఎన్నికల్లో ఉత్తరాంధ్రలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలిచేలా అందరూ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆమె విశాఖ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి హరేంధిర ప్రసాద్‌కు నామపత్రాలు దాఖలు చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

థర్మల్ ప్రాజెక్టును అడ్డుకుంటాం

- ఉద్యోగాల పేరుతో మోసం తగదు
- రైతులకు అండగా ఉద్యమిస్తాం
- మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి– ఆమదాలవలస

సరుబుజ్జిలి మండలం వెన్నెలవలస వద్ద 3,200 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మించ తలపెట్టిన హానికారక థర్మల్ పవర్ ప్రాజెక్టును అడ్డుకుంటామని మాజీ స్పీకర్, వైసిపి సీనియర్ నాయకులు తమ్మినేని సీతారాం అన్నారు. పట్టణంలోని తన నివాసంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో సోంపేట, కాకరాపల్లిలో థర్మల్ పవర్ ప్రాజెక్టులు పెట్టాలని చూసిన గత ప్రభుత్వాలు ప్రజాగ్రహానికి గురై విరమించుకున్నాయని గుర్తుచేశారు. సరుబుజ్జిలి మండలంలో 1600 ఎకరాల భూములు ఎవరివి తీసుకుంటారో చెప్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. థర్మల్ ప్లాంట్ పరిధిలోని వంద కిలోమీటర్ల వరకు వాయు, జల కాలుష్యంతో రకరకాల వ్యాధులకు గురై ప్రజలు ఇబ్బందులకు గురవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టుకు నీరు ఎక్కడ్నుంచి అందిస్తారని ప్రశ్నించారు. ఇప్పటికే రైతుల సాగుకు సరిపడా సాగునీరందడం లేదని... నాగావళి, వంశధార నీటిని సాగుకు మాత్రమే వినియోగించాలన్నారు. గిరిజనులూ ఈ ప్రాజెక్టు నిర్మాణానికి అంగీకరించడం లేదని తెలిపారు. థర్మల్ ప్రాజెక్టు ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్ ఒక్క మెగావాట్ కూడా మనం వినియోగించుకోలేమన్నారు. థర్మల్ ప్రాజెక్టు పేరుతో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని మాయమాటలు చెప్పి మోసం చేయడం సరికాదన్నారు. థర్మల్ ప్రాజెక్టు ఏర్పాటు యోచనను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు అండగా నిలుస్తామని, వారితో కలిసి ఉద్యమిస్తామన్నారు. మేధావులు, విద్యార్థులు, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు థర్మల్ ప్రాజెక్టుపై తమ వైఖరిని తెలియజేయాలని కోరారు. సమావేశంలో వైసిపి నాయకులు కె.వి.జి సత్యనారాయణ, తమ్మినేని చిరంజీవి నాగ్, పేడాడ చిరంజీవి, సురవరపు నాగేశ్వరరావు, కింజరాపు సురేష్, బొడ్డేపల్లి నారాయణరావు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి – శ్రీకాకుళం

జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. ఇంటర్ పరీక్షల ఏర్పాట్లపై కలెక్టరేట్‌లోని తన ఛాంబరులో అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ కళాశాలల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. అన్ని కేంద్రాల్లో సిసి కెమెరాలు ఎలాంటి సాంకేతికలోపం లేకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద అత్యవసర మందులతో పాటు వైద్య సిబ్బంది విధులు నిర్వర్తించాలని, మెడికల్ కిట్స్, ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. నిర్దేశించిన సమయానికి విద్యార్థులు కచ్చితంగా పరీక్షా కేంద్రాలకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. గతానుభవాలను దృష్టిలో ఉంచుకొని ఏవైనా సమస్యలు, లోటుపాట్లు ఉంటే పరీక్షలకు ముందే వాటిని గుర్తించి పరిష్కరించుకోవాలని సూచించారు. విద్యార్థులు సమయానికి చేరుకునేలా ప్రణాళిక బద్ధంగా ఆయా రూట్లలో బస్సులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ఈనెల పదో తేదీ నుంచి ప్రాక్టికల్స్ ప్రారంభం కానున్నాయని ఆర్ఐఒ పి.దుర్గారావు తెలిపారు. పరీక్షలు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఒకేషనల్ కోర్సు పరీక్షలు 5 నుంచి ప్రారంభమవుతాయన్నారు. థియరీ పరీక్షలు మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొత్తం 40,356 మంది (ప్రథమ సంవత్సరం 20,389, ద్వితీయ సంవత్సరం 19,967 మంది) విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. వీరిలో 37,976 మంది సాధారణ, 2380 మంది ఒకేషనల్ విద్యార్థులు

ఉన్నారని వివరించారు. 75 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరావు, ఎఎస్‌పి కె.వి రమణ, డివిఇఒ ఎస్.తవిటినాయుడు, డిఇఒ తిరుమల చైతన్య, ఇపిడిసిఎల్ ఎస్ఒ ఎన్.కృష్ణమూర్తి పాల్గొన్నారు.

రూ.103.20 కోట్లతో రోడ్డు విస్తరణ

ఆమోదం తెలిపిన కేంద్ర రోడ్డు రవాణా శాఖ

ప్రజాశక్తి – శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో సముద్రతీర ప్రాంతానికి సమీపంలో ప్రధాన రహదారి విస్తరణకు కేంద్ర రోడ్డు రవాణా శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. డోల, నౌపడ, పోలాకి (డిఎన్‌పి) రోడ్డులో 56 కిలోమీటర్ల పొడవున విస్తరణకు రూ.103.20 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతోపాటు అంపురం, ఘతిమికుండాపురం రోడ్డు 11 కిలోమీటర్ల మేర విస్తరణకు మరో రూ.23 కోట్లు విడుదల చేసినట్లు కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. తన అభ్యర్థన మేరకు కేంద్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఆమోదం తెలిపారని పేర్కొన్నారు.

డిఎన్‌పి రోడ్డును 16వ నంబరు జాతీయ రహదారితో అనుసంధానం చేసేలా

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో మాట్లాడుతున్న రామ్మోహన్ నాయుడు

నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. మొత్తంగా 67 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులకు రూ.126.20 కోట్లు విడుదల చేసినట్లు వివరించారు. జాతీయ రహదారి నిర్మాణ నిధులతో ఈ రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. త్వరితగతిన టెండరు ప్రక్రియను పూర్తి చేసి 24 నెలల్లోగా పనులు పూర్తి చేయాలని నోటిఫికేషన్ జారీ చేసినట్లు పేర్కొన్నారు.

నిర్ణీత గడువులోగా ఛార్జిషీట్ దాఖలు

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

- రహదారి ముఖ్య కూడళ్లలో సిసి కెమెరాల ఏర్పాటు
- డయల్ 100, 112 కాల్స్‌పై తక్షణం స్పందించాలి
- ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి – శ్రీకాకుళం

మహిళలు, చిన్నారులపై జరిగే పోక్సో కేసుల్లో దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసి ఛార్జిషీట్లను నిర్ణీత గడువులోగా కోర్టులో దాఖలు చేయాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. ఆయా వివరాలను పోలీస్ సిసిటిఎన్ఎస్ అప్లికేషన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి జిల్లా పోలీసు అధికారులతో గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. పోక్సో వంటి కేసులను 60 రోజుల్లోగా దర్యాప్తు పూర్తి చేసి, పూర్తి వివరాలుతో అభియోగ పత్రాలను దాఖలు చేయాలన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని, జాతీయ రహదారికి అనుసంధానమైన రహదారి కూడళ్ల వద్ద తప్పనిసరిగా సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వ్యాపార, గృహ సముదాయాలు, ఒంటరిగా ఉన్న ఇల్లు తదితర ప్రదేశాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. దాతలు, ప్రజల సహకారంతో వీలైనంత మేరకు సిసి కెమెరాలు ఏర్పాటు చేయంచాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, వసతిగృహాల వద్ద సంబంధిత యాజమాన్యంతో మాట్లాడి ఏర్పాటు చేయించాలని సూచించారు. సైబర్ టోల్ ఫ్రీ నంబరు 1930 ద్వారా అందే ఫిర్యాదులను తక్షణమే సంబంధిత ఫిర్యాదుదారులతో మాట్లాడి వివరాలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. నిర్లక్ష్యం లేకుండా ఫిర్యాదులు విచారణ చేపట్టి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రతిరోజూ డయల్ 100, 112 కాల్స్ ద్వారా వచ్చే ఫిర్యాదులు సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులు, సిబ్బంది తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. ఆయా ఫిర్యాదులు పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కారం చూపించాలని సూచించారు. ప్రతి పోలీస్‌స్టేషన్‌లో అందుబాటులో ఉన్న పెట్రోలింగ్ వాహనాలతో ఉదయం, సాయంత్రం విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా పెట్రోలింగ్ గస్తీ చేయాలన్నారు. కళాశాలలు, పాఠశాలలు వద్ద పెట్రోలింగ్ చేస్తూ ఆయా విద్యార్థులకు సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, చెడు వ్యసనాలు తదితర అంశాలపై సంకల్పం పేరిట పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులకు దిశ నిర్దేశాలు చేశారు. సమావేశంలో ఎఎస్‌పి కె.వి రమణ, సైబర్ సెల్ సిఐ శ్రీను, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బాలమురళీకృష్ణ

10న డీవార్మింగ్ డే

- నులిపురుగుల నివారణ మాత్రలు వేయించాలి
- జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి టి.వి బాలమురళీకృష్ణ

ప్రజాశక్తి – శ్రీకాకుళం అర్బన్

ఈనెల పదో తేదీన డీవార్మింగ్ డే సందర్భంగా నులిపురుగులను నివారించేందుకు పిల్లలందరికీ ఆల్బెండాజోల్ మాత్రలు వేయించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి టి.వి బాలమురళీకృష్ణ అన్నారు. జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదో తేదీన మాత్రలు వేసుకోని వారికి 17వ తేదీన వేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలు, జూనియర్ కళాశాలల విద్యార్థులకు డీవార్మింగ్ మాత్రలు (ఆల్బెండాజోల్ – 400 మి.గ్రా) నమిలి తినిపించనున్నట్లు తెలిపారు. ఒకటి నుంచి రెండేళ్ల వరకు అర మాత్ర, 2 నుండి 19రేళ్ల వరకు ఒక మాత్ర చొప్పున ఇవ్వనున్నామని చెప్పారు. పాఠశాలకు వెళ్లని పిల్లలకు అంగన్వాడీ కార్యకర్తల ద్వారా ఈ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రతి పాఠశాలలో ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు.

మధ్యాహ్నం భోజనం తర్వాత ప్రతి విద్యార్థికి మొతాదు ప్రకారం నమిలి మింగిస్తారని తెలిపారు. జిల్లాలో మొత్తం 4,46,992 మందికి పిల్లలు, విద్యార్థులకు అందజేయడానికి మాత్రలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారుల పర్యవేక్షణలో అన్ని పాఠశాలలకు మాత్రలు పంపిణీకి సిద్ధం చేశామని చెప్పారు. వైద్య సిబ్బందితో పాటు అంగన్వాడీ కార్యకర్తలు, స్వచ్ఛంద సేవా సంఘాల సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు. మండల పరిధిలోని పిహెచ్‌సి వైద్యాధికారులు, ఎంపిడిఒలు, ఎంఇఒలు, సిడిపిఒలు, సిఆర్‌పిల ద్వారా పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. ఈ మాత్రలు వేసుకోవడం వల్ల ఎటువంటి దుష్పరిణామాలు ఉండవని స్పష్టం చేశారు. ఒకవేళ అలా కనిపిస్తే సమీపంలోని ఆశా కార్యకర్త, ఎఎన్ఎం ద్వారా పిహెచ్‌సి వైద్యాధికారిని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమం జిల్లాస్థాయిలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి, రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం, ప్రోగ్రాం ఆఫీసర్లు, జిల్లా విద్యాశాఖాధికారి, ప్రాజెక్ట్ అధికారి (సమగ్ర శిక్ష), ఐసిడిఎస్ పీడీ సమన్వయంతో నిర్వహిస్తున్నట్లు వివరించారు. సమావేశంలో అదనపు వైద్యారోగ్యశాఖ అధికారి మేరీ కేతిరిన్, ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రాం అధికారి వెంకట్, డిపిఎం బి.రవీంద్ర, ఎపిడిమాలజిస్ట్ సుజాత, డిఐఒ ఆర్.రాందాస్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల

45,657 మంది విద్యార్థులకు రూ.35.68 కోట్లు

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలో 45,657 మంది విద్యార్థులకు రూ.35,58,63,479 ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ప్రభుత్వం విడుదల చేసిందని కలెక్టర్ స్వప్నిల్ దిన్కర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పలు కళాశాలల్లో డిగ్రీ, పిజి, ఇంజినీరింగ్, మెడికల్ కోర్సుల్లో చదువుతున్న ఎస్‌సి, ఎస్‌టి, బిసి, కాపు, ఇబిసి, మైనార్టీ విద్యార్థులకు తొలి విడతగా ఈ నిధులు విడుదలైనట్లు పేర్కొన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా 3,187 మంది ఎస్‌సి విద్యార్థులకు రూ.3,55,27,987 వారి ఖాతాలకు జమ అయినట్లు తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ ద్వారా 1221 మంది ఎస్‌టి విద్యార్థులకు రూ.2,43,34,944, బిసి సంక్షేమ శాఖ ద్వారా 39,509 బిసి విద్యార్థులకు రూ.28,24,79,131, 867 మంది ఇబిసి విద్యార్థులకు రూ. 54,68,327 జమ చేసినట్లు తెలిపారు. మైనార్టీ శాఖ ద్వారా 134 మందికి రూ.9,29,146, 723 మంది కాపు విద్యార్థులకు రూ.69,34,620, 16మంది క్రిస్టియన్ మైనార్టీ విద్యార్థులకు రూ.1,89,324 కళాశాలల బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్లు తెలిపారు. ఎస్‌సి విద్యార్థులు మినహా మిగిలిన విద్యార్థులందరికీ ట్యూషన్ ఫీజులను విద్యార్థులు చదువుతున్న కళాశాలల బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్లు పేర్కొన్నారు.

ఎక్కువ కేసులు రాజీ చేయాలి

జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి – శ్రీకాకుళం

మార్చి ఎనిమిదో తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ ఎక్సైజ్ కేసులు రాజీ చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ జిల్లా అధ్యక్షులు జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. జిల్లా కోర్టు భవనంలో ఎక్సైజ్ అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేసి పని భారం తగ్గించుకోవాలన్నారు. రాజీ పడదగ్గ కేసుల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆర్.సన్యాసినాయుడు, ఎల్.అనురాధ దేవి, ఎక్సైజ్ సిఐ ఎం.వి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రాణం తీసిన అతి వేగం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

ప్రజాశక్తి – ఎచ్చెర్ల

అతి వేగం రెండు నిండు ప్రాణాలను బలి తీసుకుంది. వేగంగా వెళ్తున్న క్రమంలో ద్విచక్ర వాహనం డివైడర్‌ను ఢీకొట్టిన ఘటన మండలంలోని చిలకపాలెం జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఈ ప్రమదంలో శ్రీకాకుళం నగరంలోని చౌదరి సత్యనారాయణ కాలనీకి చెందిన పండా తరుణ్ (19), ఫాజుల్‌బేగ్‌పేటకు చెందిన దీర్ఘాశి కార్తీక్ (21) అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం... రణస్థలం నుంచి శ్రీకాకుళం వైపు ద్విచక్రవాహనంపై వస్తున్న ఇద్దరు యువకులు అతి వేగంతో వస్తున్న సమయంలో వారు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న డివైడర్‌ను ఢీకొట్టింది. బండి పల్టీలు కొట్టగా తరుణ్, కార్తీక్ ఘటనా స్థలంలోనే మృతి చెందారు. తరుణ్ బట్టల షాపులో పనిచేస్తున్నట్లు స్థానికులు చెప్తున్నారు. తల్లి ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తుండగా, తండ్రి పళ్ల వ్యాపారం చేస్తుంటారు. కార్తీక్ ఇసుక బండికి వెళ్తుంటాడు. కార్తీక్ తండ్రి రాజు మృతి చెందగా, తల్లి ఇంటి పనులు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. చేతికందివచ్చిన కుమారులు మృతి చెందడంతో వారి కుటుంబసభ్యులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. ప్రమాదంపై కేసు నమోదు చేసిన పోలీసులు, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం ప్రభుత్వం సర్వజన ఆస్పత్రికి తరలించారు.

తరుణ్, కార్తీక మృతదేహాలు

పట్టాల రద్దుపై ఆందోళన

ప్రజాశక్తి– నౌపడ

సంతబొమ్మాళి మండలం నౌపడలో జగనన్న కాలనీలో పలు ఇళ్ల స్థలాల పట్టాలు రద్దు చేయడంపై బాధితులు గురువారం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే... గ్రామంలోని సర్వే నంబరు 480/4 (సాంఘిక వసతి స్థలం)లో గత ప్రభుత్వంలో ఐదు కుటుంబాలకు పట్టాలు మంజూరు చేశారు. అయితే వీటి హద్దులు, స్థలాలు కేటాయింపులో స్పష్టత లేకపోవడంతో వివాదం చెలరేగింది. అనపాన నాగేశ్వరరావు అనే వ్యక్తి సొంత అవసరాలకు, మురుగునీరు వెళ్లేందుకు కాలువ లేకుండా ఇతరులకు పట్టాలు మంజూరు చేయడంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి స్థలాన్ని పరిశీలించారు. ఎంత స్థలంలో పట్టా మంజూరు చేశారో అంతే స్థలం వినియోగించుకోవాలని, మురుగునీటికి ప్రభుత్వ స్థలం ఎలా వాడుకుంటారని ఫిర్యాదుదారునికి హెచ్చరించారు. అక్కడ కొత్తగా ఇచ్చినా పట్టాలు తప్పుడు సర్వే నంబరుతో ఉన్నట్లుగా గుర్తించారు. దీంతో సదరు పట్టాలు చెల్లవని ఇళ్ల పట్టాలన్నీ రద్దు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆర్‌డిఒ ఆదేశాలతో అధికారులు యంత్రాలతో ఆక్రమణ తొలగించి హద్దులు ఏర్పాటు చేశారు. దీంతో బాధితులు సంబంధిత స్థలం వద్ద పట్టాలు పట్టుకొని ఆందోళనకు దిగారు. 13 ఏళ్లుగా అదే స్థలాన్ని వినియోగిస్తున్నామని అర్జీ పెట్టడంతో గత ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసిందన్నారు. అయితే ఇచ్చిన పట్టాలపై హద్దులు, సర్వే నంబర్లు తప్పుగా వేయడంతో నష్టపోయామని వాపోతున్నారు. పట్టాలు మంజూరు చేయడానికి గతంలో స్థానిక వైసిపి నాయకులు పిలక రవికుమార్‌రెడ్డి తమ వద్ద కొంత నగదు తీసుకున్నారని బాధిత కుట

విద్యార్థిని అభినందిస్తున్న ఎస్పి

ప్రతిభకు ప్రశంసలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో పోలీసుశాఖ సాంకేతికంగా మరిన్ని విజయాలు అందుకునేందుకు వీలుగా నూతన వెబ్‌సైట్‌ను రూపొందించిన విద్యార్థికి జిల్లా ఎస్పి కె.వి మహేశ్వరరెడ్డి నగదు పురస్కారంతో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. గురువారం ఎస్పి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జిల్లా పోలీసుశాఖ కోసం నూతన వెబ్‌సైట్ https://srikakulampolice.ap.gov.inను కంచిలి మండలం కేసరపడకు చెందిన కొరికాన నవీన్ రూపకల్పన చేసినట్టు వివరించారు. గ్రామీణ ప్రాంతం నుంచి విద్యార్థి దశలోనే నవీన్ తన ప్రతిభ సామర్థ్యాన్ని ఉపయోగించి, నైపుణ్యంతో జిల్లా పోలీస్‌శాఖ పూర్తి వివరాలు ఒక్క క్లిక్‌తో తెలుసుకునే విధంగా వెబ్‌సైట్‌ను రూపకల్పన చేయడం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో ప్రజలు, సమాజానికి ఉపయోగపడే మెరుగైన సాంకేతిక సామర్థ్యాన్ని పెంపొందించు కోవాలని సూచించారు. నవీన్ ప్రస్తుతం ఎచ్చెర్ల మండలం వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో బి.టెక్ చదువుతున్నాడని, రానున్న రోజుల్లో మరింత మెరుగ్గా రాణించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పి కె.వి రమణ, సైబర్ సెల్ సిఐ శ్రీనివాస్, ఎఎస్ఐ రమేష్ పాల్గొన్నారు.

కాళిదాసును అభినందిస్తున్న డిజిఒ తిరుమల చైతన్య

జాతీయస్థాయి పోటీలకు కాళిదాసు

ప్రజాశక్తి- కవిటి

మహారాష్ట్రలోని శంభాజీనగర్‌లో ఫిబ్రవరి 13 నుంచి 16 వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి అండర్-14 సాఫ్ట్‌బాల్ పోటీల్లో కవిటి మండలం మాణిక్యపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కాళిదాస్‌సాహు పాల్గొంటున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.సుమలత తెలిపారు. ఈ సందర్భంగా గ్రీక్స్ తుది పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య కాళిదాసును అభినందిస్తూ జాతీయస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి సుందర రావు, పిడి, పిఇటి అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.వి.రమణ, ఎస్‌టిఎఫ్ బి.వి.రమణ, రాజారావు పాల్గొన్నారు. అదేవిధంగా కాళిదాసు ఎంపికపై పాఠశాల సిబ్బంది, స్థానిక ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు. కాళిదాస్ విజయానికి కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయుల సేవలు కొనియాడారు.

వెట్టిచాకిరీ నేరం

టెక్కలి : వెట్టి చాకిరీ విధానం చట్ట రీత్యానేరమని, దీనిని ప్రోత్సహించవద్దని టెక్కలి జూనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు అన్నారు. వెట్టిచాకిరీ నిర్మూలనా దినోత్సవం సందర్భంగా గురువారం పట్టణంలో ర్యాలీ చేపట్టారు. స్థానిక కోర్టు వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ పాత బస్టాండ్ మీదుగా అంబేద్కర్ కూటి వరకు సాగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం వెట్టి చాకిరీ నిర్మూలిద్దామని ప్రతిజ్ఞ చేపట్టారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కార్మికశాఖాధికారి పి.సువర్ణ, ఎఎస్ఒఆర్ రాధాకుమారి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు దివ్వల వివేకానంద, ప్యానల్ న్యాయవాదులు ఎం. గోవింద్, పి.మధుబాబు, ఆర్.ప్రభుచంద్, ఎల్.బాలకృష్ణ, మండల విద్యా కార్యాలయ సిబ్బంది మల్లేశ్వరరావు, కె.ఇంద్రతనయ, అరుణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

జి.సిగడాం: మండలంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు శ్రీకాకుళం ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కెవి, జి.సిగడాం ఉపకేంద్రం పరిధిలో ఉన్న విద్యుత్ లైన్లు మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు తెలిపారు. మండలంలో జి.సిగడాం, బాతువ, గెడ్డ కంచరాం, నడిమివలస, జాడ, ఎందువపేట, సేతు భీమవరం, గోబ్బూరు, నిద్దాం, అద్దోనంపేట , చెట్టు పొదిలం, మదుపాం, వెలగడ, చంద్రయ్య పేట, దేవరావలస, ఆర్‌సిహెచ్‌పురం గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

కవిటి: ఇచ్ఛాపురం 132/33 కెవి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఇఇ యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. కవిటిలో 33/11 కెవి సబ్‌స్టేషన్, రాజపురం 33/11 కెవి సబ్‌స్టేషన్, బొరివంక సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు, వ్యవసాయ సర్వీసులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

ఎన్నికల కోడ్ వర్తించదా!

దర్శనమిస్తున్న ఫ్లెక్సీలు

మందస: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని బాలిగాం కూడలి రోడ్డులో కూటమి నాయకుల ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. మండల అధికారులకు పలుమార్లు చెప్పిన మాకు పట్టినట్టు ఉందని వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రు ఎన్నికల కోడ్ ఉన్న నేపథ్యంలో ఎటువంటి ప్రభుత్వ కార్యక్రమాలు చేపట్టరాదని జిల్లా అధికారులు చెప్పినా యథేచ్ఛగా కార్యక్రమాలు చేపడుతూ... కొన్ని సెంటర్ల దగ్గర ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. అధికారులకు ఇంత నిర్లక్ష్యం ఏమిటని ప్రజలు విమర్శిస్తున్నారు. దీనిపై జిల్లా యంత్రాంగం స్పందించి ఫ్లెక్సీలు తీయించాలని కోరుకుంటున్నారు.

నాయకత్వ సామర్థ్యం పెంపొందించుకోవాలి

వజ్రపుకొత్తూరు: మహిళలు నాయకత్వ సామర్థ్యం పెంపొందించు కోవాలని ఎపిఎం గొడబ ప్రసాదరావు అన్నారు. మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో కమ్యూనిటీ బెస్టు ఆర్గనైజేషన్ పాలన, నాయకత్వంపై గురువారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల సమాఖ్య కార్యవర్గ సభ్యులకు, సిసిలకు వారి పనితీరు నాయకత్వం బాధ్యతలపై అవగాహన ఉండాలన్నారు. స్వయం సహాయక సంఘాలు, విఒలు, ఎంఎస్‌లు పాలన, నుపరిపాలన నాయకత్వం తదితర బాధ్యతలపై వివరించారు. సిసిలు రేణుక, నీలవేణి, వెంకటేష్, ఇసి సభ్యులు, అకౌంటెంట్ మీనా, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల పరిశీలన

ఇచ్ఛాపురం: వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఎంఇఒ అప్పారావు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అమీన్ సాహెబ్‌పేట ప్రాథమిక పాఠశాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పరిరక్షణలో విద్యార్థుల తెలుగు అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. పిఎం పోషణ రాగిజావా విద్యార్థులందరూ సక్రమంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల రికార్డులను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

'108' సిబ్బందికి శిక్షణ

పలాస : పలాస ప్రభుత్వాస్పత్రి ఆవరణలో 108 సిబ్బందికి ఎఇఎంఎస్ఇఒ జగన్ పర్యవేక్షణలో గురువారం ఆన్‌జాబ్ ట్రైనర్ నెయ్యిల కృష్ణ శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణలో 108 సిబ్బందికి నూతన పోకడలకు అనుగుణంగా బేసిక్ లైఫ్ సపోర్ట్ తరగతులు నిర్వహించారు. ఎయిర్ వే మేనేజ్‌మెంట్, 108 అంబులెన్స్‌లో ఉండే పరికరాలు, మందులు వాటి ఉపయోగాల గురించి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పలాస, టెక్కలి డివిజన్ పరిధిలో పనిచేస్తున్న ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

రోడ్డు పనులు పరిశీలన

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు పట్టణంలో జరుగుతున్న రోడ్డు పనులను స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ గురువారం పరిశీలించారు. మండల కేంద్రంలో కాటిచెరువుకాలనీ నుంచి పెద్దచెరువు వరకు సుమారు రూ.90 లక్షలతో ఈ రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. రహదారి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని, నిర్మాణాలను మార్చిలోపు పూర్తి చేయాలని సూచించారు. మేజరు పంచాయతీలో ఉన్న నిధులన్నీ పారిశుధ్యం, మౌలిక వసతులకే వినియోగించాలని, రోడ్లుకు ఎన్ని నిధులు కావాలన్నా మంజూరు చేయించేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. పారిశుధ్యంపై అవగాహన కల్పించాలని తరువాత రోడ్లపై చెత్తవేసిన వారిపైన, రోడ్డుపక్క మలమూత్రాలు విసర్జించిన వారిపై అపరాధ రుసుం వసూలు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కొందరు మహిళలు రోడ్లు వేయాలని కోరగా ప్రతి వీధికి రోడ్లు రోడ్లు మంజూరుచేస్తానని, వ్యక్తిగత పారిశుధ్యం పాటించాలని సూచించారు. ఈయనతో పాటు టిడిపి మండల అధ్యక్షులు చిగులపల్లి రామ్మోహన్, ఉపాధ్యక్షులు

రహదారి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

బాడాన శేషగిరి, రవి, అప్పలనాయుడు, రామారావు, వేణుగోపాలం, రమణ తదితరులున్నారు.

తాడివలస గ్రామస్తుల సన్మానం

పియుసి చైర్మన్‌గా నియమితులైన ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను తాడివలస గ్రామస్తులు గురువారం ఘనంగా సన్మానించారు. గ్రామసర్పంచ్ తమ్మినేని మనెమ్మ, గ్రామస్తులు రవికుమార్‌కు దుశ్శాలువ, మెమెంటోతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తాడివలస పంచాయతీ అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని రవికుమార్ హామీఇచ్చారు.

జాతరలో ఏర్పాటు చేసిన జెయింట్ వీల్స్

నేటి నుంచి కమ్మసిగడాం జాతర

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని కమ్మసిగడాం శ్రీ మహాలక్ష్మి తల్లి జాతర ఉత్తరాంధ్ర జిల్లాలో అతిపెద్ద జాతరగా పేరుగాంచింది. ప్రతి ఏడాది ఫిబ్రవరి నెలలో ఈ జాతర జరుగుతుంది. ఈ నెల 7వ తేదీ శుక్రవారం నుంచి 9వ తేదీ ఆదివారం వరకు జరుగుతుంది. ఈ ప్రాంతంలో అత్యంత భక్తి శ్రద్ధలతో ఈ జాతరను నిర్వహిస్తారు. చుట్టుపక్కల జిల్లాలు, గ్రామాల నుంచి తండోపతండాలుగా యాత్రికులు అమ్మవారిని దర్శనం చేసుకోవడానికి బారులు తీరుతారు. కమ్మసిగడాం మొత్తం పేరుకు తగ్గట్టుగానే మామిడి తోరణాలు, విద్యుత్ కాంతులతో విరాజిల్లుతుంది. చిన్న, పెద్ద, పిల్లలు తేడా లేకుండా తన్మయత్వంతో భక్తిలో మునిగిపోతారు. కనుల విందుగా మూడురోజుల పాటు నియమ నిష్ఠలతో జాతర సాగుతుంది. జాతరకు సర్వం సిద్ధమైంది. భారీ పోలీస్ బందోబస్తు మధ్య జరిగే ఈ జాతరలో జైంట్ వీల్స్, ద్విచక్ర వాహనాలు, కార్లుతో విన్యాసాలు తదితర వినోదభరిత కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ జాతర ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు వి.వి.ఎస్.వి.ప్రసాద్, ఉపాధ్యక్షులు వెలిచేటి రామకృష్ణ, వెలిచేటి రాజారవిచంద్ర, వెలిచేటి తేజ, కోశాధికారి వెలిచేటి రాజశేఖర్, మన్నె లక్ష్మీప్రసాద్, వెలిచేటి సురేష్ కుమార్ తదితరుల ఆధ్వర్యంలో నిర్వహణ జరుగుతుంది.

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని మర్రిపాడు-సి సర్పంచ్ రవ్వల అనురాధ, ప్రతినిధి గణపతిరావు అన్నారు. మండలంలోని సవర మర్రిపాడు పరిధిలో ఉపాధి హామీ నిధులు రూ.40 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందన్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారరని అన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి సమాంతరంగా అందుతుందని వివరించారు. గ్రామసభలు నిర్వహించి ప్రజల సమస్యలను

శంకుస్థాపన చేస్తున్న గణపతిరావు

పూర్తిస్థాయిలో తెలుసుకున్నామని, అన్నారు. పల్లె పండగ ద్వారా ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో పెద్దింటి భీమారావు, అన్నారావు, సంజీవ్, బాలరాజు, చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లను ప్రారంభిస్తున్న డాక్టర్ దానేటి శ్రీధర్

దానేటి దాతృత్వం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జనసేన నాయకులు డాక్టర్ దానేటి శ్రీధర్ తన దాతృత్వాన్ని చాటుకున్నారు. నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో ఉన్న బిసి బాలికల వసతిగృహంలో తన సొంత నిధులతో మూడు మరుగుదొడ్లను నిర్మించి గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా జనసేన అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డా.శ్రీధర్ మాట్లాడుతూ శ్రీకాకుళం నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు ఉదయ్ శంకర్, గురుప్రసాద్, మోహన లక్ష్మి బిసి వసతిగృహంలో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, అందులో ప్రధానంగా విద్యార్థినులకు సరిపడినన్ని మరుగుదొడ్లు లేకపోవడం వల్ల సకాలంలో వారు క్లాస్‌లకు వెళ్లలేక అవస్థలు పడుతున్నారని తనకు వివరించినట్టు తెలిపారు. వారి అభ్యర్థన మేరకు ఇటీవల వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థులతో మాట్లాడడం జరిగిందని, తన సొంత నిధులతో మూడు మరుగుదొడ్లను నిర్మించి ప్రారంభించామని వివరించారు. జనసేన కార్యకర్తలు ప్రజాసమస్యల పరిష్కారమే సామాజిక బాధ్యతగా భావించి పనులు చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో రాజేష్, కొండ్రు వరప్రసాద్, చిట్టి భాస్కర్, ముంగి జగదీష్, సాయి, వీర మహిళలు కీర్తి సుశీల, స్వాతి, అనురాధ, రాజేశ్వరి, హేమలత, జనసేన కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ జోన్ ఏర్పాటు ఆమోదయోగ్యం

టెక్కలి : కేంద్ర ప్రభుత్వ రైల్వేశాఖ విశాఖ జోన్ మంజూరు చేస్తూ... తీసుకున్న నిర్ణయం ఆమోదయోగ్యమని ఆంధ్రా-ఒడిశా ఐక్య కార్యాచరణ సమితి కన్వీనర్ డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేసిన జోన్‌లో నౌపడ రైల్వే కూడలిని చేర్చడం శుభపరిణామని అన్నారు. నౌపడ రైల్వే కూడలిలో ప్రస్తుతం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ఇంకా విస్తరించాలన్నారు. ప్రధానంగా తాగునీటి సౌకర్యం కల్పించే దిశలో చర్యలు తీసుకోవాలన్నారు. రాజాం-పలాస రైల్వే లైన్ పనులు త్వరితగతిన పూర్తయ్యేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆదాయంలో నౌపడ కూడలి ముందంజలో ఉన్నా... సౌకర్యాలు కల్పనలో ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. టెక్కలి రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు కూడా వేగవంతం చేయాలన్నారు. టెక్కలి రైల్వేస్టేషన్‌లో రాజ్యారాణి ఎక్స్‌ప్రెస్ నిలుపుదలకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై కేంద్ర పౌర విమానయాశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు చర్యలు తీసుకోవాలని అన్నారు.

కగార్ ఆపరేషన్ నిలిపివేయాలి

ప్రజాశక్తి- పలాస

హరనాథ్

కేంద్ర ప్రభుత్వం ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో కగార్ పేరుతో నిర్వహిస్తున్న నరమేధం తక్షణం ఆపాలని, ఇది మావోయిస్టులను అణిచే చర్యగా ప్రచారం చేయడంలో కేంద్రం చెప్తున్న వాస్తవంగా ఈ చర్య గ్రీన్‌హంట్ కంటే ప్రమాదకరమైనదని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి సభ్యులు డి.హరనాథ్ అన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడారు. కగార్ పేరుతో అటవీ భూమిని, భూగర్భ అటవీ ఖనిజ వృక్ష సంపదను కార్పొరేట్లకు అప్పగించడానికి సిద్ధమైందన్నారు. అటవీ చట్టాలను పార్లమెంట్ సాక్షిగా కార్పొరేట్లకు అనుకూలంగా సవరణలు తెచ్చి కగార్ ఆపరేషన్ చేపట్టిందన్నారు. దీని ద్వారా అటవీ ప్రాంతాల నుంచి ఆదివాసీలకు వారి గృహాలపై, అడవులపై వారి యాజమాన్య హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని అన్నారు. అడవుల విస్తీర్ణం కనీసం 30 శాతం ఉండాలని, తద్వారా వాతావరణ సమతుల్యత ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం పబ్లిక్ రంగాన్ని కారు చౌకగా ఆదానీ, అంబానీలకు అప్పగించేందుకు కగార్ తీసుకొచ్చారని అన్నారు.

నేటి నుంచి తిరు కళ్యాణం

కవిటి: మండలంలోని లోల్లపుట్టుగలో ఉన్న కళ్యాణ వెంకటేశ్వర స్వామి 44వ తిరు కళ్యాణ మహోత్సవం, 55వ సుప్రభాత వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం నుంచి ఆదివారం వరకు వైభవోపేతంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు అన్నదానం నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో యాత్రికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పాఠశాల ఆవరణలో ఆక్రమణలు

ప్రజాశక్తి- లావేరు

మండల కేంద్రంలోని జెడ్‌పి పాఠశాల మైదానం గత కొన్నేళ్లుగా ఆక్రమణలకు గురవ్వడంతో ఇటీవల పాఠశాల రక్షణగోడ నిర్మాణానికి ప్రభుత్వం పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా రూ.54 లక్షల నిధులను మంజూరు చేయడంతో స్థానిక కూటమి నాయకులు రక్షణ గోడ నిర్మాణానికి పనులు చేపట్టారు. మైదానం ఇప్పటికే ఆక్రమణలకు గురవ్వడంతో సర్వే నిర్వహించారు. ఇప్పటికే పలువురు వాణిజ్య సముదాయలు, షాపులు కట్టడం, మరికొంత మంది పశు

పాఠశాల మైదానంలో అక్రమంగా వేసిన రేకుల షెడ్

రక్షణ గోడ నిర్మాణానికి చదును చేసిన పాఠశాల మైదాన ప్రాంతం

వుల శాలలు, రేకులషెడ్లు నిర్మించారు. ఇవన్నీ పాఠశాల మైదానంలోనే నిర్మించినట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఈ అక్రమ కట్టడాలను తొలగించి పాఠశాల రక్షణగోడ నిర్మాణం చేపట్టాలని పాఠశాల విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు. ఇప్పటికే జెసిబిలతో రక్షణగోడ నిర్మాణం చేపట్టే ప్రదేశంలో తుప్పలు తొలగింపు, చదును చేయడం వంటి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. అయితే అక్రమ నిర్మాణాలు ఎంతవరకు తొలగిస్తారో వేచి చూడాలి.

కేన్సర్‌పై అవగాహన అవసరం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కేన్సర్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, విద్యార్థులు గ్రామాల్లో అవగాహన కల్పించేందుకు కృషి చేయాలని ప్రముఖ స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ దానేటి శ్రీధర్ సూచించారు. నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యాన ప్రపంచ కేన్సర్ దినోత్సవాన్ని నిర్వహించారు. 'బయోకెమిస్ట్రీ అండ్ ఆర్ఆర్‌సి జెమ్స్, ఎస్ఒజిఎస్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్త్రీలలో అధికంగా వచ్చు గర్భాశయ కేన్సర్లపై అవగాహన కల్పించారు. వందమంది విద్యార్థులకు కేన్సర్ వ్యాక్సిన్ సరఫరాతో పాటు ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు అధ్యక్షత వహించగా

మాట్లాడుతున్న డాక్టర్ దానేటి శ్రీధర్

రిసోర్స్‌పర్సన్‌గా జెమ్స్ ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ ఆర్.అరవిందర్, డాక్టర్ కె ప్రశాంతి, ఎస్ఒజిఎస్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ జి.ప్రమీల వ్యవహరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.శంకరనారాయణ, అకడమిక్ కో-ఆర్డినేటర్ సిహెచ్ కృష్ణారావు, ఐ క్యూఎసి కో-ఆర్డినేటర్ ఎస్.పద్మావతి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.ఆదిలక్ష్మి, జంతుశాస్త్ర శాఖవిభాగాదిపతి ఐ.హేమ పద్మజ, డాక్టర్ వై.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయోగాలపై విద్యార్థులకు అవగాహన

ఇచ్ఛాపురం : మండలంలోని కొలిగాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రయోగాలపై అవగాహన కల్పించారు. హెచ్ఎం నరేంద్రనాథ్ పట్నాయక్ ఆధ్వర్యాన సహాలాలపుట్టుక ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుడు ప్రమోద్ కుమార్ పాడి 25 ప్రయోగాలు చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలని వినతి

పలాస : ఆర్‌టిసి ఎంపాయీస్ యూనియన్ కార్యాలయానికి స్థలం కేటాయించాలని రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు కోరారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే గౌతు శిరీషను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్‌టిసి ఉద్యోగులకు ఐఆర్ చెల్లించాలని, పిఆర్‌సి కమిషన్ నియమించేలా ప్రభుత్వానికి ఒప్పించాలని కోరారు. గత ప్రభుత్వంలో ఉన్న బకాయిను చెల్లించే విధంగా సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో అమరావతి స్టేట్ సెక్రటరీ బాసూరు కృష్ణమూర్తి, డిపో గౌరవాధ్యక్షులు దువ్వాడ శ్రీకాంత్, జోనల్ నాయకులు జి.రాజు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గూనాపు త్రినాథ్, దశరథ, మల్లా అప్పల రాజు,, అన్నాబత్తుల దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న ఇయు నాయకులు

ఆయిల్‌పామ్‌తో సిరుల పంట

రైతులకు సూచనలు ఇస్తున్న సునీత

వజ్రపుకొత్తూరు: అయిల్ పామ్ సాగుతో సిరులు పండించవచ్చునని ఉద్యానవనశాఖ అధికారి కె.సునీత అన్నారు. మండలంలోని కవిటి అగ్రహారంలో సాగు చేస్తున్న పంటను గురువారం పరిశీలించారు. నేషనల్ మిషన్ ఫర్ ఎడిబుల్ ఆయిల్- ఆయిల్పామ్ పథకం ద్వారా ఆయిల్ ఫామ్ సాగుకు పోత్సాహకాలు అందిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా బెండి గేటు ప్రాంతంలోని కవిటి ఆగ్రహారం వద్ద 16 ఎకరాల్లో ప్రయోగాత్మకంగా సాగుచేస్తున్నామని తెలిపారు. జిల్లాలో వజ్రపుకొత్తూరు, కోటబొమ్మాళి, సంత బొమ్మాళి, నందిగాం, మండలాలాను శాంతి ఆయిల్ పామ్ ప్రయివేటు లిమిటెడ్ కంపెనీకి కేటాయించారని అన్నారు. అన్ని నేలల్లో పండించే పంట అని అన్నారు. ఏడాది పొడవునా నీటి వసతి ఉంటే నాలుగేళ్ల తరువాత ప్రతి 15 రోజులకు పంట దిగుబడి వస్తుందని తెలిపారు. ఈలోగా అందులో అంతర పంటలగా ఆరుతడి పంటలు వేసుకోవచ్చునని రైతులకు సూచించారు. ఏడాదికి 8 నుంచి 14 టన్నుల అయిల్‌పామ్ గెలలు దిగుబడి ఉంటుందని తెలిపారు. ఎనిమిది టన్నుల ధర రూ.1.12 నుంచి రూ.2 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. ఈ ధర ప్రతినెలా మారుతుందని, ఇది దీర్ఘకాలికంగా సుమారు 30ఏళ్ల పాటు ఆదాయం ఇస్తుందన్నారు. చీడపీడలకు తట్టుకునే పంట అని, తక్కువ పెట్టుబడి అధిక ఆదాయం లభిస్తుందని సూచించారు. ఆసక్తి కలిగిన రైతులకు వందశాతం రాయితీలో మొక్కలు అందిస్తా మన్నారు. నాలుగేళ్ల ఆరుతడి అంతర పంటల సాగుకు రూ.8,400 అందజేస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు 7995086805 నంబరును సంప్రదించాలని కోరారు.

జానకిరామిరెడ్డికి సన్మానం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

చిన్నప్పటి నుంచి కళారంగంలో చేస్తున్న సేవలకు గుర్తింపుగా తెలుగు వెలుగు సాహితీ వేదిక తనకు నంది అవార్డును ప్రదానం చేసిందని కళాకారుడు రంగాల జానకిరామిరెడ్డి అన్నారు. ఇటీవల నంది అవార్డు పొందిన ఆయనను జిల్లా కెమిస్టుల సంఘం, ఇచ్ఛాపురం కెమిస్టుల సంఘం నాయకులు, సభ్యులు స్థానిక కన్యకా పరమేశ్వర ఆలయంలో గురువారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి జానపద గీతాలు, పాండురంగ భజనలు, భక్తి గీతాలు ఆలపిస్తూ వస్తున్నానని తెలిపారు. కళారంగంలో తన కృషిని గుర్తించిన తిప్పన ధనుంజయ తెలుగు వెలుగు సంస్థకు తెలియజేశారని వెల్లడించారు. జానకిరామిరెడ్డికి నంది అవార్డు రావడంపై సంఘ నాయకులు, సభ్యులు

సన్మానిస్తున్న సంఘసభ్యులు

హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో మరింత పేరు ప్ర